ప్రజాశక్తి
శుక్రవారం 7 జూన్ 2024
5
అల్లూరి సీతారామరాజు

ఖాళీ సీట్లలో ప్రవేశానికి అవకాశం

ప్రజాశక్తి - హుకుంపేట: స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలురు)-1లో 2024-25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల హెచ్ఎం వంతిన బాలాజీ ప్రకటనలో కోరారు. పాఠశాలలో నాలుగో తరగతికి 40 సీట్లు, 5వ తరగతి 25 సీట్లు, ఆరవ తరగతికి 25 సీట్లు, ఎనిమిదో తరగతి 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు, వ్యాయామవిద్య, లైబ్రరీ, డిజిటల్ సైన్స్ ల్యాబ్, ఆటపాటలు, విద్యార్థుల భవిష్యత్తుకు కెరీర్ గైడెన్స్‌తో పాటుగా సెలవు దినాలలో సూపర్‌వైజర్ స్టడీ, పడుకునే ముందు కూడా విద్యార్థుల యోగక్షేమాలను పర్యవేక్షించేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపట్ల నిరంతర పర్యవేక్షణ, మినరల్ వాటర్ సదుపాయ విశాలమైన డైనింగ్ హాల్, రుచికరమైన భోజనం, విద్యార్థుల హాస్టల్ రూమ్స్‌లో సరిపోయే విద్యుత్ కాంతి, పడుకొనేందుకు మంచాలు ఇలా అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులంలో చేర్పించాలని కోరారు.

వరదలను ఎదుర్కొనేందుకు
ముందస్తు సన్నద్ధతపై సమీక్ష

- ముంపు మండలాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు
- మూడునెలల రేషన్ ముందుగానే పంపిణీ
- అందుబాటులో అత్యవసర సామగ్రి, యంత్రాంగం
- అధికారులకు కలెక్టర్ విజయసునీత ఆదేశం

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి పాడేరు : రానున్న వర్షాకాలంలో ముంపు ప్రభావిత చింతూరు, విఆర్ పురం, కూనవరం, ఏటపాక మండలాల్లో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత ఆదేశించారు. ఈఏడాది వరదలను ఎదుర్కోవడానికి ముందస్తు సన్నద్ధతపై గురువారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందనివాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరదలు తీవ్రత మరింత ఎక్కువయ్యే అవకాశాలున్నాయన్నారు. గత రెండేళ్లలో వరదల సమయంలో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరేను నాటి అనుభవాలను అందరికీ వివరించాలని సూచించారు.

ఈ సందర్భంగా సూరజ్ గనోరే మాట్లాడుతూ ముంపు మండల కేంద్రంలోని వరద బాధితులకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, మూడు నెలలకు సరిపడా రేషన్‌ను ముందస్తుగా పంపిణీ చేయడంతోపాటు జిసిసి గోదాముల్లో బఫర్‌స్టాక్ నిల్వ ఉంచామన్నారు. పెట్రోల్, డీజిల్‌కు కొరత లేకుండా చూడడం, లాంచీలు ట్రాక్టర్లు, జెసిబిలు, ప్రోక్లైన్లు, రంపపు బ్లేడులు అందుబాటులో ఉంచడం, వరదబాధితులకు పునరావాస కేంద్రాల్లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు, వరదలకు దెబ్బతిన్న ఇళ్ళ సర్వే, పంటలు దెబ్బతిన్న రైతుల పొలాల సర్వే, వరదలు వచ్చినప్పుడు కరెంటు నిలిపివేసి, తగ్గిన వెంటనే తిరిగి పునరుద్ధరించడం, వంటి చర్యలను పకడ్బందీ ప్రణాళికతో చేపట్టామన్నారు. రెవిన్యూ అధికారులను, సిబ్బందిని ప్రతి మండలంలోని అందుబాటులో ఉంచామన్నారు. వరదలు వచ్చేటప్పుడు ముఖ్యంగా సమాచార వ్యవస్థ దెబ్బ తింటుందని, దానికి ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టామన్నారు. దీనిపై కలెక్టర్ విజయసునీత మాట్లాడుతూ, వరదలను ఎదుర్కొనే సన్నద్ధతపై సంబంధిత శాఖలు వరదలకు ముందు, వరదల సమయంలో, వరదల తరువాత చేయవలసిన కార్యక్రమాల ప్రణాళికలను సిద్ధం చేసి నివేదికల సమర్పించాలని ఆదేశించారు. అతి తీవ్రత ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని, ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సరిపడనంత రేషన్ ను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అవసరమైన పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉంచాలని జేసి భావన వశిష్ట్‌కు సూచించారు. ఇప్పటికే భఫర్ స్టాక్ సిద్ధం చేసామని, వాటిని మారేడుమిల్లి, అరకులో ఉన్న స్టాక్ కేంద్రాలకు తరలించామని జేసి వివరించారు. నాలుగు మండలాలకు చెందిన సుమారు ఐదారువేల మంది గ్రామస్తులు రోడ్ల పక్కన నివాసాలు ఏర్పాటు చేసుకుంటారని వారికి అవసరమైన టెంట్లు, తార్పాలిన్లు అందజేయాలని ఆయా మండలాల తహసిల్దార్లను, చింతూరు పిఒ చైతన్యను ఆదేశించారు. నాలుగు మండలాలలో 62 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసామని, 16 బోట్లను సిద్ధం చేసామని సంబంధిత తహసిల్దార్లకు ఆదేశాలు జారీ చేసామని పిఒ వివరించారు. అవసరమైన బోర్ మెటీరియల్ సిద్ధం చేయాలని, ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని ఆర్ డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరద స్థాయిలను ప్రజలకు, అధికారులకు తెలియజేస్తూ అప్రమత్తం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్, ఫినాయిల్, పారిశుధ్య కార్మికులను సిద్ధం చేయాలని, డిపిఒను , గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. కటింగ్ బ్లేడ్లను, జేసిబి, ప్రోక్లైన్లను సిద్ధం చేసుకుని పడిపోయిన చెట్లను, కొమ్మలను వెంటనే తొలగించాలని ఆర్అండ్‌బి అధికారులను, రోడ్లపై నిలచిన మట్టి బురదను తొలగించాలని అగ్నిమాపక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరదల అనంతరం పంట, గృహ,విద్యుత్ రహదారుల నష్టాలను అంచనా వేయాలని, ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ, సమాచార వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీసు, ఐటిడిఎ వద్ద ఉన్న శాటిలైట్ ఫోన్లను వినియోగించి సమాచారం చేరవేస్తామన్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, వరద భాదితులను ముందుగానే బలవంతంగానైనా పునరావాస కేంద్రాలకు తరలించడం ద్వారా ప్రమాద తీవ్రత తగ్గుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు, రంపచోడవరం, చింతూరులతోపాటు నాలుగు ముంపు మండలాలలో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, 24 గంటలు పని చేసేలాసిబ్బందిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు.

మారేడుమిల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపిడిఒ వీర కిశోర్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అందుకు తమ వంతుగా మొక్కలు నాటాలని ఎంపీడీవో ఎ.వీర కిషోర్, ఏపీవో రెడ్డి బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక బాలురు ఆశ్రమ పాఠశాలలో ఎంపీడీవో వీర కిషోర్, ఏపీవో రెడ్డి బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిపై మానవాళి మనుగడకు ప్రకృతి సమతుల్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. అందువల్ల అడవులు, చెట్లు నరికివేత మానుకోవాలని, లేకుంటే భావితరాలకు పెను ప్రమాదం సృష్టించిన వారమవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని ఇందుకూరిపేట పంచాయతీలో సర్పంచ్ కారం కృష్ణబాబు, ఏపీడి జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలచే ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోతిరెడ్డి వారి చెరువు దగ్గర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ కారం కృష్ణబాబు, ఏపీడి శ్రీనివాస్ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన చల్లని వాతావరణంతో పాటు పర్యావరణ కాపాడుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఏలు చిన్నప్ప దొర, వెంకటరెడ్డి, ఎఫ్ఏలు కె.రాము, బాలు, రామకృష్ణ, నాగిరెడ్డి, శివరామ ప్రసాదు, బలరాం, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

కొర్ర లలితకు పింఛను వచ్చే విధంగా చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపకు చెందిన కొర్ర లలితకు మే, జూన్ నెలలో పింఛన్ బ్యాంక్ ఖాతాలో జమ కాకపోవడంపై 'రెండు నెలలుగా అందని వింతతు పింఛను' శీర్షికన ప్రజాశక్తి గురువారం ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్పందించారు. ఈ మేరకు ఆయన ప్రజాశక్తితో ఫోన్‌లో మాట్లాడారు. కొర్ర లలిత పింఛన్ సాంకేతికపరమైన కారణాల వల్ల రెండు నెలల నుండి ఆమె బ్యాంక్ అకౌంట్లో జమ కాలేదని పేర్కొన్నారు. అయితే ఆమె ఆధార్ కార్డును బట్టి పరిశీలించగా సీలేరు సమీపంలోని ఒడిశా రాష్ట్రం చిత్రకొండ స్టేట్ బ్యాంకులో జమ అయినట్లు చూపిస్తుందని, అయితే ఎవరి ఖాతాలో జమైందో పరిశీలించామని చెప్పారు. కొర్ర లలిత పింఛన్ విషయంపై ఉన్నతధికారులను సంప్రదించి పింఛన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

ఆదమరిస్తే అంతే.!

ప్రమాదభరితంగా అరకు -పాడేరు రోడ్డు

పాడేరు రోడ్డులో ఎండపల్లివలస బ్రిడ్జి వద్ద కోతకు గురవుతున్న రహదారి

సిమిలిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో సిసి రోడ్డు కింద కోతకు గురైన మట్టి

కల్వర్టు వద్ద కోతకు గురైన తారురోడ్డు

ప్రజాశక్తి - అరకులోయ: అరకు పాడేరు రహదారి ప్రమాదకరంగా మారింది. ఎండపల్లివలస సమీపంలోని కోడిగడ్డ బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదాలను ఆహ్వానించేదిగా తయారైంది.. దీంతో అరకు పాడేరు ఇరువైపుల నుంచి రాకపోకలు సాగించే వాహన చోదకులు, గిరిజనులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్ కోతకు గురి అవుతున్న ఈ రోడ్డును బాగు చేయాలని ఎన్ని మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఏ ఒక్కరూస్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక ప్రమాదాలు జరిగే ఈ బ్రిడ్జి వద్ద ఏమాత్రం ఆదమరిస్తే బ్రిడ్జి కిందకు వెళ్లిపోవడం ఖాయమని భయపడుతున్నారు.. అదేవిధంగా మండలంలోని కొత్త బళ్ళుగూడ పంచాయతీ సిమిలిగూడ రైల్వే స్టేషన్ కు వెళ్లే దారిలో స్వర్ణయిగుడా గ్రామం వద్ద కూడా సిసి రోడ్డు కిందన కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో అటువైపు వెళ్లే వాహన చోదకులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రమాదభరితంగా తయారైన ఆయా రోడ్డులను వెంటనే మరమ్మతులు చేయాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం చేస్తే ప్రమాదాలను ప్రోత్సాహించినట్టేనని హెచ్చరిస్తున్నారు.

పిడుగుపాటుకు ప్రైవేట్ స్కూల్ టీచర్ మృతి

మల్లేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి పాడేరు: మండలంలోని సంగోడి గ్రామానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడు సీదరి మల్లేశ్వరరావు (40) గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు సంఘటన వివరాలివి. పాడేరు జిల్లా కేంద్రంలోని అక్షర పబ్లిక్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న మల్లేశ్వరరావు వేసవి సెలవులు కావడంతో తమ పశువులను గ్రామ సమీపంలో మేతకు తీసుకొని వెళ్ళాడు ఇంతలో వర్షం మొదలు కావడంతో పక్కనే ఉన్న మామిడి చెట్ల వద్ద నిలుచొని ఉండగా సమీపంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. మల్లేశ్వరరావు పిడుగుపాటుతో హఠాన్మరణానికి గురికావడంతో సంగోడి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మల్లేశ్వరరావు కుటుంబీకులు బంధువులు తోపాటు గ్రామస్తులంతా శోక తప్తులయ్యారు.

కాగా ఉపాధ్యాయుడు మల్లేశ్వరరావు హఠాన్మరణం పట్ల అక్షర స్కూల్ సహచర ఉపాధ్యాయులు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్, పలువురు విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మల్లేశ్వరరావు కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు.అక్షర పాఠశాలలో15 ఏళ్లుగా సోషల్ టీచర్‌గా మల్లేశ్వరరావు పనిచేసున్నారని ఆయన మరణం కుటుంబానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదభరితంగా వాగులు

తక్షణమే వంతెనలు నిర్మించాలని గిరిజనుల వేడుకోలు

ఉధృతంగా ప్రవహిస్తున్న నెల్లిమెట్ల వాగు

వరద ఉధృతికి కొట్టుకుపోయిన ట్రాక్టరు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని నెల్లిమెట్ల చిన్నేరు వాగు, లాగరాయి వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షా కాలంలో అవి ప్రమాదభరితంగా మారుతున్నాయి. వర్షాకాలంలో వానలు అధికంగా కురిసే క్రమంలో ఈ వాగులు పొంగి రహదారిపై నుండి వరద నీరు ప్రవహిస్తుంది. నెల్లిమెట్ల వాగు వద్ద వరద ఉధృతికి పలుమార్లు ఆటోలు, ట్రాక్టర్లు, బైకులు కొట్టుకుపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వాగులు పొంగితే వాగు అవతల ఉండే సుమారు పది గ్రామాలకు వాగు తగ్గేవరకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షా కాలంలో ఈ వాగుల వద్ద రహదారి మీదుగా ప్రయాణం చేసే వందలాది మంది ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన నెల్లిమెట్ల చిన్నేరు వాగు, లాగరాయి వాగులపై వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు.

పెరటి మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకుకూరలు, కూరగాయలు పెంపకంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పెరట్లో అణువుగా పెరిగే ఆకుకూరలు, కూరగాయలు పెంపకంపై మహిళలు శ్రద్ధ చూపాలని ఫౌండేషన్ టీం లీడర్ వాసు, ప్రోగ్రాం అధికారి జ్యోతి సూచించారు. మండలంలోని ఓకర్తి గ్రామంలో గురువారం మహిళలకు పెరటి మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు, జ్యోతి మాట్లాడుతూ ఇంటి పెరట ఆవరణలో ఆకుకూరలతో బాటు, చిక్కుడు, గోరుచిక్కుడు, ఇతర కూరగాయల మొక్కలు పెంపకం పద్ధతులను వివరించారు. వీటికి పశువుల ఎరువు మాత్రమే ఉపయోగించాలని, ఎటువంటి రసాయనిక ఎరువులు వాడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

స్వయంఉపాధికి ప్రోత్సాహం

గిరిజన మహిళలకు 30 కుట్టు మిషన్ల పంపిణీ

కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న స్వర్ణలత

ప్రజాశక్తి - చింతపల్లి: నిరుపేద గిరిజన మహిళల స్వయంఉపాధికి స్వర్ణలత సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ అందజేస్తున్న కుట్టు మిషన్ల ద్వారా చేతి వృత్తిని నేర్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రాజమండ్రికి చెందిన స్వర్ణలత సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకురాలు పి స్వర్ణలత అన్నారు. గురువారం మండలంలోని గడపరాయి గ్రామంలో నిరుపేద గిరిజన మహిళలకు 30 కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతివత్తుల ద్వారా గిరిజన మహిళల ఉపాధికి బాసటగా నిలవాలన్న ఆలోచనతో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. తమ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఇప్పటివరకు 8 వేల మందికి కుట్టుమిషన్లు అందించామన్నారు. తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా స్వర్ణలతను గడపరాయి గ్రామస్తులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సిహెచ్ రాజా రమేష్, కొర్ర సూరిబాబు, పాస్టర్లు కొర్ర శామ్యూల్, దొరబాబు, పాంగి రాంబాబు, సీందెరి రాంబాబు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కూటమి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి-అడ్డతీగల : రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి విజయం, రంపచోడవరం నియోజకవర్గం నుండి టిడిపి అభ్యర్థి మిరియాల శిరీషా దేవి గెలుపొందడంపై టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. టిడిపి అడ్డతీగల మండల అధ్యక్షులు జర్త రమణారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దేవిచౌక్ వద్ద ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా కష్టపడడమే ఈ విజయానికి మూలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అన్నం సత్యనారాయణ రెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు చదువుల రామకృష్ణ, మేడిశెట్టి శ్రీనివాసరావు, చోళ్ళ కృష్ణారెడ్డి, ఈరోజి స్వప్న కుమారి, జుజ్జవారపు శ్రీనివాస్ చౌదరి, వంక సతీష్, సింగంశెట్టి శ్రీనివాసరావు, టేకుమూరు నాగేశ్వరరావు, సత్తి రెడ్డి పాల్గొన్నారు.

దేవీపట్నం : దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో మండలంలోని ఏనుగులగూడెం గ్రామంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు భారీ కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా కుంజం రాజామణి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసి పాలన సాగించిన జగన్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. పోలవరం నిర్వాసితులను వైసిపి గాలికొదిలేసిందని, వారి సమస్యలను కూటమి మాత్రమే పరిష్కరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మెహర్ బాబా, జి.నగేష్, లంక హరిబాబు, ఎం నాగేశ్వరరావు, జి చంటిబాబు, ఎం.బాబురావు, జె.నాని, దివిటి అంజి, అయినవిల్లి భద్రం పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : మండలంలోని ఉర్లాకులపాడు గ్రామంలో మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, మాజీ జెడ్పిటిసి కోసూరి బుజ్జి చిన్నాలమ్మ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మిరియాల శిరీషదేవి ఎమ్మెల్యేగా గెలుపొందడం, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకాబోడంతో ఆనందోత్సవాల్లో వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోసూరి గంగమ్మ, పార్టీ నాయకులు కాకూరి కాసులమ్మ, కోసూరి మల్లిరెడ్డి, దోమాదుల వీరబాబు, వెంకటరెడ్డి, రోబో, గంగరాజు, సోమరాజు, నాగు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో సంబరాల్లో పాల్గొన్న టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు

దేవీపట్నం మండలం ఏనుగులగూడెంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

విశాఖ-భద్రాచలం బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : విశాఖపట్నం నుండి సీలేరు మీదగా భద్రాచలానికి నూతన ఆల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును విశాఖపట్నం డిపో ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. ఈ బస్సు విశాఖపట్నంలో ఉదయం 5 గంటల బయలుదేరి నర్సీపట్నం మీదుగా సీలేరుకు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటుంది. మధ్యాహ్నం భోజనం అనంతరం సీలేరులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు భద్రాచలంలో బయలుదేరి సీలేరు మీదుగా విశాఖపట్నం వెళుతుంది. కొన్నాళ్లుగా ఇదే రూట్‌లో తిరిగే పాత ఆల్ట్రా డీలక్స్ బస్ సర్వీసు అనేకసార్లు ఘాట్ రోడ్లో మరమ్మతులకు గురయ్యేది. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రయాణికులకు ప్రయాణ సౌకర్యం కలిగేలా కొత్త బస్సు సర్వీస్‌ని విశాఖపట్నం డిపో ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు గురువారం విశాఖపట్నం నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్ళింది. ఆర్టీసీ అధికారులు దూరప్రాంత ప్రయాణికులు దష్టిలో ఉంచుకొని నూతన బస్సు ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి, రంపచోడవరం : మారేడుమిల్లి 33కెవి పీటర్ పరిధిలోనూ, రంపచోడవరం మండలం ఫోక్స్‌పేట 11కెవి ఫీడర్ పరిధిలోనూ చెట్లు నరుకుతున్న (ట్రీ కటింగ్) కారణంగా ఈ రెండు ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎండి యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మారేడుమిల్లి మండలం పరిసర గ్రామాలు, రంపచోడవరం మండలం బందపల్లి, ఊట్ల, తామరపల్లి, నరసాపురం, ఫోక్స్‌పేట పరిసర గ్రామాల విద్యుత్ వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

ఆటపాటల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

ఉత్సాహంగా గిరి బాల నేస్తం

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలలో గిరి బాల నేస్తం క్లబ్ ఆధ్వర్యంలో ఆసరా ఛారిటబుల్ సొసైటీ, గౌతు లచ్చన్న బలహీనవర్గ సంస్థ ఆధ్వర్యంలో 12 రోజులుగా సమ్మర్ క్యాంపును ఉత్సాహంగా నిర్వహిస్తున్నామని గిరిజన మహిళ సంఘం, బద్యా మండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి తెలిపారు. బాల బాలికలకు ఆసరా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కిప్పింగ్, చెస్ బోర్డ్, క్యారం బోర్డ్, తదితర క్రీడాసామగ్రి పరికరాలను అందించామన్నారు. గిరి బాల నేస్తం జిల్లా కన్వీనర్ వివి జయ ఆదేశాలతో స్థానిక కల్యాణ మండపం వద్ద గిరిజన మహిళా సంఘం బద్యా మండల కార్యదర్శి విజయ చౌరవతో దారాపల్లి, లక్ష్మీపురం, దేగల పుట్టు బరిలిగూడ, మండిబా, సెలంపుట్టు, సుజనకోట, కుమ్మిడిపుట్టు గ్రామాలలో గిరి బాల నేస్తం కార్యక్రమాలను చేపట్టారు. వినూత్నమైన ఆటపాటలతో వేసవి కాలంలోగిరి బాల నేస్తం కార్యక్రమం నిర్వహించడం చిన్నారులకు ఉత్తేజం పరుస్తుందన్నారు. కార్యక్రమాలను నిర్వహణకు ముందుకొచ్చి సహకరించిన గిరిజన మహిళా సంఘం, బద్యా మండల కమిటీ సభ్యులు రజని, దేవి, మీనా, దశర, లక్ష్మీ జీవన, మాతృశాల విద్యా వాలంటీర్ దేవి పాల్గొని బాలబాలికలకు ఆటపాటలు నేర్పిస్తున్నారు గిరి బాల నేస్తం ముగింపురోజున ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందిస్తామనితెలిపారు.

పాఠశాల పునఃప్రారంభానికి విద్యార్థుల హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి -జి.మాడుగుల : పాఠశాలల పున ప్రారంభానికి మరొక వారం రోజులు గడువున్నప్పటికీ పాఠశాల మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని గిరిజన సంక్షేమశాఖ మండల సహాయ అధికారి ఏ తిరుపాల్ కోరారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాల ప్రారంభం నాటికి అందరు విద్యార్థులు హాజరయ్యేలా పాఠశాల సిబ్బంది చూడాలని సూచించారు. జూనియర్ కాలేజీలు తెరుచుకుని వారం రోజులౌతున్నా అనేక మంది విద్యార్థులు ఇంకా తరగతులకు హాజరు కావడం లేదని, ఇంటర్ సెకెండియర్ విద్యార్థులంతా వెంటనే కాలేజీలకు చేరుకోవాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని అరకు పాడు సంతలో గిరిజనేతరులు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులు పంచాయతీ కార్యాలయానికి అనుకొని విచ్చలవిడిగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు ఉన్న సమయంలో, ఇదే అదనుగా గిరిజనేతరులు అక్రమనిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అధికారులు స్పందించి, తక్షణమే అక్రమ నిర్మాణాలు అడ్డుకట్ట వేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పి సత్యనారాయణ, కె.రామకృష్ణ, పి ముత్తు, మోహనరావు పాల్గొన్నారు.

వర్షాలతో చిత్తడిగా ఆర్‌టిసి కాంప్లెక్స్

ప్రజాశక్తి-గొలుగొండ : ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఆర్టీసీ బస్‌కాంప్లెక్స్ చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గతంలో ఎన్నోసార్లు ఆర్‌టిసి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా కాంప్లెక్స్ ఆవరణలో బురదగా మారుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓటేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి- చింతపల్లి : మన్యంలో సార్వత్రిక ఎన్నికల్లో పోటీల్లో నిలిచిన సిపిఎం అభ్యర్థులకు ప్రజలు విశేష ఆదరణ చూపి ఓట్లేశారని, ఓటేసిని ప్రతి ఒక్కరికీ పేరుపేరునాల అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్య పడాల్ ధన్యవాదాలు తెలిపారు. గురువారం చింతపల్లి, జికెవిధి, కొయ్యూరు మండలాల సిపిఎం కార్యకర్తలతో సమావేశమై, సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ అరకు పార్లమెంట స్థానంలో సిపిఎం అభ్యర్థి అప్పలనర్సకు ప్రజలు స్వచ్ఛందంగా 1 లక్ష23 వేల ఓట్లు వేశారన్నారు. ఎన్నికల మెటీరియల్ ఖర్చులు తప్ప ప్రజలకు పైసా ప్రలోభం చూపని పార్టీ అయినప్పటికీ, ప్రజంలంతా ఎంతో ఆదరించి స్వచ్ఛందంగా ఓట్లేశారని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగ వర్గాలతో పాటు ముస్లిం మైనారిటీ వర్గాలకు, అరకు పార్లమెంటు పరిధిలోని ఓటరులందరికీ సిపిఎం తరపున కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఓటర్లు చూపించిన అభిమానం సిపిఎం కేడర్‌లో మరింత ఉత్తేజాన్ని నింపిందని, ఎల్లప్పుడూ ప్రజల పక్షాన సమస్యలపై మరిన్ని పోరాటాలు చేసేలా స్ఫూర్తి, ప్రేరణనిచ్చిందన్నారు కేంద్ర, రాష్ట్రాలలో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వాలకు మన్యప్రాంతం సమస్యలతో స్వాగతం పలుకుతోందన్నారు, అనేక గ్రామాలలో తాగు, సాగునీరు, రహదారులు, విద్యుత్, వైద్యం వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడడంతోపాటు, రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలు, హక్కులు అమలుకు నోచుకోవడం లేదన్నారు. పీసా, 1/70 చట్టం పటిష్ట అమలు, జిఒ 3 పునరుద్ధరణ, ఐదవ షెడ్యూల్ ప్రాంతం కాపాడవలసిన బాధ్యత రాబోవు నూతన ప్రభుత్వాలపై ఉందన్నారు. గిరిజన ప్రాంతంలో అరకు, చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలు నిలుపుదల చేయాలని, అంబానీ, అదానీలకు అడవులను ధారాదత్తం చేయడాన్ని గిరిజనులు వ్యతిరేకిస్తున్న విషయం రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు, గిరిజన గ్రామాలలో లేటరైట్ మైనింగ్ ఎర్రమట్టి లాంటి ఖనిజాలను తీసి ఆ ప్రాంతాలను పంట పొలాలు, మంచినీళ్లకు దూరం చేస్తున్నారని, ఇటువంటి వాటి పై కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు, పాడేరు, అరకు, చింతపల్లి కేంద్రంగా చిన్న తరహా పరిశ్రమలు కాఫీ, మిర్యాలు, మొక్కజొన్న, చింతపండు, అడ్డాకులు, విస్తర్లు తయారీ వంటి పరిశ్రమలు ఏర్పాటు చేసి గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాల కార్యదర్శిలు పాంగి ధనుంజయ్, అంపురంగి బుజ్జిబాబు. ఎస్ సూరిబాబు, సాగిన చిరంజీవి, గడుతూరి సత్యనారాయణ, వై అప్పలనాయుడు, ఎస్ సింహాచలం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన్నయ్యపడాల్

అద్దింట్లోనే అంగన్వాడీలు

- శిథిలావస్థలో పలు సొంత భవనాలు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, సిబ్బంది
- పలు కేంద్రాల్లో తాగునీటికి కటకట
- తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- పట్టించుకోని ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అంగన్వాడి కేంద్రాల పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది, అంగన్వాడీ వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో ఇక్కడ సిడిపిఒ కార్యాలయం ఏర్పాటు చేశారు అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న కార్యాలయం ప్రస్తుతం నక్కపల్లి మండలానికి మార్చడంతో, అప్పటి నుంచి అంగన్వాడీ కేంద్రాల మండలంలో మరింత దిగజారిపోయిందనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులుగానీ, నేతలు గానీ దీన్ని పట్టించుకునే పరిస్థితి లేదని పలువురు అంటున్నారు.

మండల వ్యాప్తంగా 82 అంగన్వాడీ కేంద్రాలుండగా, వాటిల్లో 23 కేంద్రాలు అద్దె కొంపలో కొనసాగుతున్నాయి, నాలుగు మాత్రం రెంట్ ఫ్రీలో కొనసాగుతుండగా, జల్లూరు, నీలిగుంట, చిన్న బొడ్డేపల్లి, తంగేడు, రామచంద్రపాలెం అంగన్వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరో ఐదు భవనాల్లో ఆందోళనకరంగా విధులు నిర్వహిస్తున్నారు, నాడు నేడు నిధులతో చౌడువాడ, పీకే పల్లి, ఎండపల్లి, గ్రామాలలో కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. అయితే అవి పూర్తికావాల్సి ఉంది. మరికొన్ని భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని లబ్ధిదారులతోపాటు చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు ఇదిలా ఉండగా కోటవురట్ల పోలీస్ స్టేషన్ వద్ద నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనం పూర్తయినా, ప్రారంభానికి నోచుకోలేని పరిస్థితి ఉంది. దీనిపై ఐసిడిఎస్ సూపర్వైజర్ దుర్గాదేవిని వివరణ కోరగా, భవన నిర్మాణం పూర్తయినా, బిల్లులు చెల్లించలేదంటూ కాంట్రాక్టర్ భవనం తాళాలను అప్పజెప్పలేదని దీంతో భవనం ప్రారంభం కాలేదన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల ఒకటి నుంచి నెలాఖరు వరకు మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు, డిఎంహెచ్ఒ డాక్టర్ సి జమాల్ భాషా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ ప్రారంభించారు. ఐటిడిఎ కార్యాలయం నుండి పాత బస్టాండ్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ జమాల్ భాషా మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో మురుగునీటి నిల్వలు పెరిగి, దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీంతో మలేరియా, డెంగీ, వ్యాధులు ప్రబలకుండా దోమల నిర్మూలనపై చర్యలు చేపట్టాలని కోరారు. రెండవ విడత మలేరియా నివారణి పిచికారి పనులు జూలై 1వ తేదీ నుండి ప్రారంభమవుతాయన్నారు. ఇంటి లోపలి అన్ని గదుల్లో మలేరియా నివారిణి మందును పిచికారి చేసేటట్లు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజలను చైతన్యపరచాలన్నారు. జిల్లా మలేరియా అధికారి అల్లూరి సీతారామరాజు పి ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా ప్రబలిన గ్రామాలకు సంబంధిత మలేరియా సబ్‌యూనిట్ అధికారి సందర్శించి తగిన నివారణ చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించారు.

పిహెచ్‌సి వైద్యాధికారులతో సమీక్ష

మలేరియా వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న తొమ్మిది పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బందితో ఐటిడిఎలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ, వ్యాధి తీవ్రతకు తగ్గట్టుగా నివారణ చర్యలకు పిహెచ్‌సిల్లో ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని మలేరియా, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. మలేరియా జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్థానిక అసిస్టెంట్ మలేరియా అధికారి డి శేషయ్య , డిస్టిక్ విపిడి కన్సల్టెంట్ జి శ్రీను పాల్గొన్నారు.

జీవాల పెంపకంలో శాస్త్రీయ మెళకువలు

ప్రజాశక్తి - మాడుగుల : జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలపై జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. మాడుగులలోని అగ్రి ల్యాబ్ ఆవరణలో పాడేరు వెటర్నరీ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలోని చీడికాడ, మాడుగుల మండలాల పశు వైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు,గోపాలమిత్రలు పాల్గొన్నారు. వీరందరికీ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలను డాక్టర్ సిహెచ్ నరసింహులు వివరించారు. లింగ నిర్ధారిత వీర్యం, రైతు భరోసా కేంద్రాల క్లస్టర్స్ గ్రేడింగ్, 1962 అంబులెన్సు సేవలు, మిల్క్ యాక్ట్, గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వంటి శాఖపరమైన అంశాలపె రెండు మండలాల పశుసంవర్ధకశాఖ యంత్రాంగంతో నర్సింహులు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మాడుగుల ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎటువంటి సౌకర్యం జరగకుండా పారిశుధ్యంపై ప్రధానంగా దృష్టి సారించాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, పెండింగ్ పనులు పూర్తిచేయడం ప్రాధాన్యతాంశాలుగా పనిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ వన్ టైం సెటిల్మెంట్ డాక్యుమెంట్లు అందజేయాలన్నారు, సచివాలయంలోని అన్ని విభాగాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా సేవలందించాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి స్వామినాయుడు పాల్గొన్నారు.

సీతారామస్వామి దేవాలయ చైర్మన్ పదవికి కన్నయ్యశెట్టి రాజానామా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలోని పురాతన సీతారామస్వామి దేవాలయ చైర్మన్ పదవికి పద్మనాభుని కన్నయ్యశెట్టి గురువారం రాజీనామా చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన కన్నయ్యశెట్టి, ఆ పార్టీ ఓటమితో తాను రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత ఆలయ కార్యనిర్వహణ అధికారికి, ఆలయ అర్చకులకు మెయిల్ ద్వారా పంపించారు. దీనికి సంబంధించి ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ నలుగురు సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలకి చైర్మన్‌గా పద్మనాభుని కన్నయ్యశెట్టిని నియమించారన్నారు.

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

డ్యూటీ సర్టిఫికెట్ల కోసం యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో హోమ్ ఓటింగ్, పోలింగ్ డే, కౌంటింగ్‌లలో పాల్గొన్న ఉపాధ్యాయ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒ కె.మోహన్ కుమార్‌కు యుటిఎఫ్ జిల్లా నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఆర్‌ఒను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు ఉన్నారు

రబీ ధాన్యం కొనుగోలు చేయరూ..

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లేక రైతులు పండించిన వరి ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని ఎల్లవరం పంచాయతీ పరిధిలో సుమారు 600 ఎకరాల్లో రబీ వరి పంట కోతకు రాగా, రైతులు కోతలు కోశారు. అయితే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవలసిన వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పైగా అడ్డతీగల మండలంలో ఎక్కడా వరి పంట పండించినట్లు తమకు తెలియదని మండల వ్యవసాయ విస్తరణ అధికారి నిర్లక్ష్య ధోరణితో మాట్లాడటం శోచనీయం. దళారులు ఒకపక్క రైతులను మోసం చేసి తక్కువ ఖరీదుకు ధాన్యం కొనుగోలు చేసుకుని, తీసుకుని వెళుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం 'ఈ క్రాప్' తప్పనిసరి కావడంతో రైతుల వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారుల వాహనాల ఫొటోలు తీసుకుని వాటిని పై అధికారులు పంపించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ధాన్యం కొనుగోలుపై దృష్టిపెట్టి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పల్సర్ బైక్ అపహరణ

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ప్రాంతంలో ద్విచక్ర వాహనాల చోరీ జోరుగా సాగుతోంది. సీలేరులో ఎస్కె విక్రమ్ బషీర్ తన ఇంటి ముందు హ్యాండ్ లాక్ వేసి ఉన్న ఎపి 31సిఎ 1701 నెంబర్ గల పల్సర్ బైక్‌ను బుధవారం రాత్రి ఒంటి గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లాక్ విరగ్గొట్టి అపహరించుకుపోయారు. ఈ సందర్భంగా బాధితుడు ఎస్.కె విక్రమ్ బషీర్ ప్రజాశక్తితో మాట్లాడుతూ రాత్రి ఒంటిగంట తర్వాత లేచి ఇంటి ముందు బైక్ చూసేసరికి లేదన్నారు. గురువారం ఉదయం తమ ఇంటి సమీపంలో ఉన్న మెడికల్ షాప్ రాంప్రసాద్ సిసి కెమెరా ఫుటేజ్‌లు పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు బైక్‌ను అపహరించినట్లు అందులో రికార్డు అయిందని పేర్కొన్నారు.

అయితే నిందితుల ముఖచిత్రాలు కనిపించడం లేదన్నారు. ముగ్గురు వ్యక్తులు ఎన్ఎస్200 బైక్‌పై వచ్చారని, వారిటో ఇద్దరు వ్యక్తులు బైక్‌ను అపహరించి రామాలయం సెంటర్ నుంచి సీలేరు జల విద్యుత్ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి వైపు బైక్‌ను తోచుకుంటూ వెళ్లినట్లు రెండు మూడు సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయిందని తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎస్ఐ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లామని, బైక్ సంబంధించిన పత్రాలు, సి-బుక్కు ఎస్ఐకి ఇవ్వడం జరిగిందని చెప్పారు. దీనిపై ఎస్సై రామకృష్ణను ప్రజాశక్తి వివరణ కోరగా బైక్ చోరీపై బైక్ చోరీపై బాధితుడు తమకు ఫిర్యాదు చేయలేదని, అయితే చోరీ జరిగినట్లు సమాచారం ఇచ్చారని తెలిపారు. బైక్ అపహరణపై అన్వేషణ చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు.

మానవ అక్రమ రవాణా కేసులో పురోగతి

స్వదేశానికి చేరుకున్న 68 మంది భారతీయులు
విశాఖ సిపి డాక్టర్ ఎ.రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల కాలంలో సంచలనం సృష్టించిన మానవ అక్రమ రవాణా కేసులో పురోగతి సాధించామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల కంబోడియా నుంచి నగరానికి చేరుకున్న నలుగురు బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు భారతదేశం నుంచి వెళ్లి కంబోడియాలో చిక్కుకుపోయిన 158 మంది భారతీయులను గుర్తించామని తెలిపారు. వారిలో ఇప్పటి వరకూ 68 మందిని భారతదేశానికి తిరిగి తీసుకొచ్చామన్నారు. ఇంకా 90 మంది అక్కడే ఉన్నారని తెలిపారు. వారిలో 25 మంది భారతదేశానికి తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన వారిలో 28 మంది విశాఖ వాసులని వెల్లడించారు. ఈ కేసు విచారణ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 21 మంది ఏజెంట్లను గుర్తించామని, వారిలో 11 మంది విశాఖ వారు ఉన్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణా మాత్రమే కాకుండా సిమ్ కార్డ్ సప్లైకి సంబంధించి కూడా పెద్ద స్కాం నడుస్తోందని తెలిపారు. ఇండియా నుండి సిమ్ కార్డులు కొనుగోలు చేసి వాటిని కంబోడియాలో 10 వేల నుండి 15 వేలకు అమ్ముతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను గుర్తించామని, వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వారు కాగా.. ఒకరు ఒడిశాకు చెందినవారని అన్నారు. ఆరుగురు ఏజెంట్లపై ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్ విడుదల చేశామన్నారు. భారతదేశం నుంచి వివిధ స్కాముల ద్వారా సేకరించిన సొమ్మును బిట్ కాయిన్‌లుగా మార్చి చైనాకు చేరవేస్తున్నారని తెలిపారు. కంబోడియాలో చిక్కుకున్న వారు ఎవరైనా భారతదేశానికి రావాలనుకుంటే తమను సంప్రదించాలని, పాస్‌పోర్ట్ లేని వారు కంబోడియాలోని భారత దేశ దౌత్య కార్యాలయాన్ని సంప్రదిస్తే వారు తాత్కాలిక పాస్ పోర్ట్‌ను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బాధితులు మాట్లాడుతూ తమను ఆంధ్రప్రదేశ్ నుండి తెలిసినవారు కంబోడియాలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని అక్కడికి తీసుకెళ్లారన్నారు. అనంతరం కంబోడియాకి చెందిన కంపెనీలకు 4 వేల నుండి 6 వేల డాలర్లకు విక్రయించారన్నారు. వారు ఒక వారం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం భారతదేశానికి చెందిన వ్యక్తులను పలు రకాల స్కామ్‌ల ద్వారా మోసం చేసేందుకు ఉసిగొల్పారన్నారు. వివిధ మార్గాల ద్వారా భారతీయులను ఆర్థికంగానూ, మానసికంగానూ బలహీనపరిచి భారత ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయటమే ప్రధాన లక్ష్యంగా పలు సంస్థలు కంబోడియాలో పని చేస్తున్నాయని వారు వివరించారు. అక్కడ వారు చెప్పినట్టు పనిచేసి భారతీయులను మోసం చేస్తే లక్షల్లో ఇన్సెంటివ్ ఇస్తారని, పనిచేయని వారిని డార్క్ రూముల్లో పడేసి 2-3 రోజులు ఆహారం అందించకుండా చిత్రహింసలకు గురిచేస్తుంటారని తెలిపారు.

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సిపి రవిశంకర్

ఇటీవల ఛేదించిన కేసులు

గడిచిన నెలరోజుల్లో రెండు హనీ ట్రాప్ కేసులను నగర పోలీసులు ఛేదించారని క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్‌రావు తెలిపారు. వారిలో ఒక వ్యక్తి దగ్గర నుంచి రూ.46.6 లక్షలు, మరొక వ్యక్తి దగ్గర నుంచి కోటీ 12 లక్షలు సొమ్మును హనీ ట్రాప్ ద్వారా కంబోడియాకి చెందిన వ్యక్తులు కాజేసారని తెలిపారు. ఎవరైనా తెలియని వ్యక్తులు అమ్మాయిల ప్రొఫైల్ పిక్‌తో మెసేజ్ పంపిస్తే వాటికి స్పందించవద్దని ఆయన ప్రజలను కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా బాధ్యులు గురువారం జివిఎంసి సిఎంఒహెచ్ డాక్టర్ నరేష్ కుమార్‌తో జివిఎంసి కార్యాలయంలో చర్చించారు. చర్చల సందర్భంగా సిఎంఒహెచ్ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ సేఫ్టీ పరికరాలు, రైన్ కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫారం, మాస్కులు, గ్లౌజులు, గమ్ము బూట్లు ఇస్తామని అన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7 లక్షలు చెల్లిస్తామన్నారు. అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, మిస్సింగ్ జీతాలు, మిగిలి ఉన్న కార్మికులకు ఐడి కార్డులు జారీ చేస్తామన్నారు. రిటైర్మెంట్ 60 సంవత్సరాలకు కాకుండా 62 సంవత్సరాలకు అమలు చేస్తామన్నారు. డెత్, 60 సంవత్సరాలు దాటిన, లాంగ్ ఆబ్సెంట్ పోస్ట్‌ల్లో భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నూతన ప్రభుత్వం మార్గనిర్దేశకంలో పని చేస్తామన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఅర్.నాయుడు పాల్గొన్నారు.

ఎయును ప్రక్షాళన చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయును తక్షణం ప్రక్షాళన చేయాలని ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు, ఎయు విద్యార్థి నాయకుడు సమయం హేమంత కుమార్ అన్నారు. పసుపు నీళ్లతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ముఖ ద్వారాన్ని ఆయన గురువారం శుద్ధి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యువతను మోసగించిన ప్రభుత్వానికి తగిన శాస్తి జరిగిందన్నారు. ఎయులో 19 కోర్సులను ఎత్తివేసి విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. విసి ఆగడాలను వివరించారు.

విశాఖ పోర్టు (ఫైల్ ఫొటో)

కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో విశాఖ పోర్టుకు 18వ స్థానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ప్రపంచ బ్యాంకు రూపొందించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో విశాఖపట్నం పోర్టు 18వ స్థానాన్ని సాధించింది. విశాఖ కంటైనర్ టెర్మినల్ ఈ నూతన మైలురాయిని చేరుకోవడంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచిందని గురువారం పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ వెల్లడించారు. సూచీలో మెరుగైన స్థానం దక్కడానికిగల కారణాలను వివరించారు. 'స్థానిక కంటైనర్ టెర్మినల్ నేపాల్ ఆధారిత కంటైనర్లకు గేట్ వే పోర్టుగా ఉంది. 65కు పైగా కంటైనర్ లైన్లు కలిగి ఉంది. ఎనిమిది నిరంతర సర్వీసులు ఉన్నాయి' అని ఆయన తెలిపారు. పోర్టు సాధించిన ఈ అసాధారణ విజయాన్ని స్టేక్ హోల్డర్లు, రైల్వేలు, కస్టమ్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం అభినందించాయి. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించడానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చాయి. ఈ ఘనతను సాధించిన టెర్మినల్ నిర్వాహకులు, పోర్టు కుటుంబ సభ్యులను పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ట్విట్టర్ ద్వారా అభినందించారు.

పోర్టు పని తీరు ప్రతిభావంతం

2023-24 ఆర్థిక సంవత్సరంలో విశాఖ పోర్టు సరుకు రవాణాలో అత్యంత ప్రభావవంతమైన పనితీరు కనబరిచి మేజర్ పోర్టులలో నాలుగో స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే సరుకు రవాణాలో 13.5 శాతం వృద్ధిని కనబరిచింది. విశాఖపట్నం పోర్టు సాధించిన ఘనత పట్ల కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా మంత్రిత్వ శాఖ సంతృప్తిని వ్యక్తం చేసింది.

మలేరియా నివారణకు వైద్య బృందాలను పంపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మన్యంలో మలేరియా జ్వరాల నివారణకు వైద్య బృందాలను పంపాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, అనంతగిరి సహా పలు మండలాలలో వందలకొద్దీ గిరిజనులు మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత ఐదు నెలల్లో 790 పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. చింతూరు మండలంలో మోతుగూడెం, పోలూరు, తులసిపాక, లక్కవరం తదితర గ్రామాలలో ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయన్నారు. మన్యంలో జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు సమారు 2500 వున్నాయన్నారు. పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లోనూ జ్వర పీడితులున్నారన్నారు. పాడేరు సర్వజన ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో బాధితులు వస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అవసరమైన వైద్య శిబిరాలు వెంటనే ఏర్పాటు చేయాలని, మంచి నీరు, పౌష్టికాహారం, దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. వ్యాధి తీవ్రతవున్న వారిని విశాఖపట్నంలోని కెజిహెచ్ ఆసుపత్రికి తరలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర వైద్యశాఖ అధికారికి భారత నాస్తిక సమాజం ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు.

చంద్రకు నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కమ్యూనిస్టు అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి కార్యక్రమాన్ని అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నాయకులు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు పాల్గొన్నారు.